
# నేను చెడిపోలేదు



కోమలాదేవి

కమల రాణి నిద్ర లేవలేదు.

తెల్లవారి ఆరు గంటలు దాటింది— కానీ ఆమె తన గది విడిచి ఇవతలికి రాలేదు. సాధారణ కుటుంబాలల్లో యింటి కోడలు కొన్ని సార్లు ఆలస్యంగా, తలుపు తెరచుకుని వచ్చినా ఆశ్చర్య పోరు. ఏదో సుస్తీ చేసిందనో, సరిగా నిద్ర పట్టక తెల్లవారి నిద్రపోయి— మెలకువ రాలేదనో సరి పెట్టు కుంటారు. కానీ అది వేరే సంగతి. కమల కాపు రానికి వచ్చి ఐదు సంవత్సరాలు గ్రిరున తిరిగి పోయినా, ఆమె అంత ఆలస్యం చేయటానికి సాహసించలేదు. అందుకు కారణాలు కొల్లలు.

ఆ రోజు ఆరు గంటలు దాటింది.

అత్తగారు కాళికా స్వరూపిణి య్యింది. రోజూ ఆ వేళకి ఇల్లంతా శుభ్రంగా వూడ్చి వంటిల్లంతా కడిగి— వంటకు గిన్నెలన్నీ శుభ్రం చేసి వుంచి— పాలు పితికిన చెంబు కుంపటి ప్రక్కగా పెట్టి నూతి దగ్గర శుభ్రం చేస్తూనో, పూజకు పువ్వులు కోస్తూనో అగుపించే కోడలు ఆ నాడు నిద్ర లేవలేదు. విందుకో— ఏం కారణమో — యంత్రంలా టంచనుగా పనులన్నీ ప్రకమంగా సమయానికి చేసే కమల ఆనాడు లేవలేదు — అని ఆలోచించటానికి బదులు ఆమె ఉగ్రురాలై— ఈ అపరాధాన్ని క్షమించరాదని నిశ్చయించుకుంది. ఇంకా నిద్ర మత్తు వద లని కళ్ళు విస్ఫులింగాల్ని కురిపిస్తున్నాయి. క్రోధం జడలు విప్పుకున్నలా ఆమె కుంతలాలు చిందర వందరగా వీపు మీద పరచుకుని వున్నాయి. ముఖం రక్త వర్ణం దాల్చింది. విసురుగా వెంట్రుకలు ముడి వేసికొని కొంగు నడుములో దోపుకుని గబ గబ కోడలి గది దగ్గర కెళ్ళి ధన ధన మని తలుపు బాది బిగ్గరగా అరచింది "ఏమే — ఇంకా మెలకువ రాలేదా ? పనంతా ఎవడు చేస్తా డనుకున్నావు? రాణీలా వవ్వళిస్తే కుదరదు. లేలే — ఆలస్యమై పోయింది..."

లోపల్నుంచి ఏ జవాబు లేదు.

ఆమె మరి కాస్త బిగ్గరగా తలుపు తట్టింది.... తెల్లవారగానే శాపనార్థాలు మొద లెట్టింది. తలుపు ఇవతలనే మెటికలు విరిచింది. అనరాని మాట లన్నది. ఇక జాగు చేస్తే చీపురుకట్టే గతి — ఆ విషయం కమలకు దెలుసు. ఏనా ఆరోజు కమల తలుపు తెరచుకుని — భయంతో కంపించి పోతూ బెదరిన చూపుల్ని నేలకేసి కేంద్రీకరించి, కొంగు నిండుగ కప్పుకుని — అత్తగారి ఆ విషబాణాల నుండి తను తాను రక్షించు కోటానికి ఆ కొంగులో ముడుచుకు పోయి త్వరగా గది బైటికొచ్చి అంతకన్నా వేగంగా పెరటి వైపు వెళ్ళ లేదు.

ఆమె కోపం ఆకాశాన్నంటు తోంది.

"ఏమిటే గోల" మామగారు — గొణుక్కుంటూ అటుకేసి మళ్ళారు. ఆయనకు వేళకు తిండి, రెండు పూటలా వేడినీళ్ళ స్నానం, సాయంత్రం అలా షికారు వుంటే ఇక ఏమీ అక్కర్లేదు. పాకిస్తాన్ దాడి జరిపిన రోజుల్లోనూ, కొడుకు ఇంటికి రాక వీధుల వెంట తిరిగి తిరిగి ఇంటి కొచ్చి భార్యను హింసించిన రోజుల్లోనూ, ఇరవై నాలుగ్గంటలు ఇంట్లోనే వుండి తన భార్య కోడల్ని ప్రతి విషయంలో సాధించే రోజుల్లోనూ ఆయన ఒకే తీరులో మార్పు లేకుండా యంత్రంలా జీవితాన్ని వెళ్ళ బుచ్చుతున్నాడు.

ఆయనకు తెలుసు — ఆ యింట్లో తనకు అంత కన్నా స్థానం లేదని.

ఏ విషయాలల్లో నైన కల్పించుకుంటే — భార్యకు గాని, కొడుక్కు గాని, బ్రతుకు జెడి ఇల్లు జేరిన కూతురికి గాని సుతరామూ యిష్టం లేదు. దాని క్కారణం అతనిలోని మంచితనం— చెడు జరుగుతుండగా చూచి సహించలేని గుణం — పరోపకార చింతన. ఆయన కల్పించుకుంటే బాగు పడ్డట్లే. ఇక కోడలు నెత్తి కెక్కి కూచోదూ ? వేళకు అన్నీ సమకూరుతాయా — పని మనిషి కిచ్చే జీతం మిగుల్తోంది. ఈ కోడలు పని దానికి ముప్పూట్లలా భోజనం పెట్టి గుడ్డ లిస్తుంటే సమయానికి అన్నీ అమరుతున్నాయి ఏం— వూరికే చేస్తోందా! దాని తిండికి, బట్టకు ఏంత ఖర్చు కావటం లేదు? దీనికింత ఖర్చు పెడ్తూ పైగా పని మనిషి కూడానా? అప్పటికి రెండు పూటలా చెయ్యి కాల్చు కునేది అత్తగారే— ఇక పైపని భాగ్యానికి ఇంతకన్నా ఏం కావాలీ అట!

కోడలికి జరుగుతున్న అన్యాయాన్ని చూచి సహించలేక ఎన్నో సార్లు జోక్యం కల్గించుకుని ముగ్గురి చేత చీవాట్లు తిని మవునం వహించటం నేర్చుకున్నాడు. ఒకటి రెండుసార్లు వియ్యంకుడికి రాసి కోడల్ని పుట్టింటి వారు కొన్నాళ్లపాటు వుంచుకుని పంపేలా చేశాడు. కోడ లక్కడున్నంత కాలం డబ్బు పంపే వాడు — వారికి భారం కాకుండా వుండటానికి. పెన్షన్ పుచ్చుకున్న తర్వాత ఈ సాయం కూడ చేయలేక పోయాడు. బీదరికంలో అల్లాడు తున్న తలిదండ్రులు కమల రాక పోవటమే మంచి దనుకున్నారు. దాని ఖర్మ అని వూరుకున్నారు. వో నెల రోజులపాటు పుట్టింట్లో వుండి తన బాధనంతా తల్లి దగ్గర చెప్పుకుని వోదార్పు నొంది తిరిగి ఆ నరకంలో ప్రవేశించటానికి ధైర్యం పొందే అవకాశం కూడ ఆమెకు లేదు. తన వాళ్ల గతి లేని వాళ్లని అత్తగారు రోజు కొకసారైనా దెప్పుతుంది. దాని క్కారణం తన కొడుకే అని ఆమెకు తెలిసినా తెలియనట్లే నటించేది.

అత్తను — ఆడ బిడ్డను త్రాసులో వేసి తూస్తే సరి సమానంగా తూగగలరు.

కమల కున్న కష్టం ఏమిటి ? భర్త సరిగా చూచుకోడు. ఉండవలసిన వ్యసనాలన్నీ సంతరించుకున్నాడతను. అతను కొన్ని నెలలు యింటికే రాడు. కావలసినప్పుడొచ్చి డబ్బు పట్టు కెళ్లటం తప్ప మిగతా సమయాల్లో యిల్లు, భార్య గుర్తుకురారు. కట్న రూపంలో వచ్చిన నాలుగెకరాల మాగానీ పై వచ్చే ధాన్యపు తాలూకు డబ్బు కమల చేతిలో పడీ పడక ముందే అతను వస్తాడు. తల్లి అండలో — కమలను హింసించి ఆ డబ్బు లాక్కు పోతాడు. డబ్బులేని సమయంలో ఉన్న కొద్ది పాటి నగల్లో ఏదో ఒక నగ, అవీ అయిపోగానే ఏదైన మంచి చీర — అవీ పాతబడగానే — వెండి చెంబూ పళ్లెం...... ఇలాగే అతని కోరికలు అనేక రకాలుగా మారు తుండేవి.

అన్నీ అయి పోయిన తర్వాత — కమలలో కూడ అన్నీ అడుగంటి పోయాయి. అస్థిపంజరం మీద — లాగుతూ పరచిన చర్మంలా తయారైంది. ఏమీ మిగల్లేదు. గుంటలు పడిన ఆ కళ్లు వెలితిగా అతి భయంకరంగా అగుపించేవి. పాలిపోయిన పెదాలు నిర్జీవంగా నిశ్చలంగా వుండేవి. మూగ దానిలా మౌనంగా వుండటం నేర్చుకున్న ఆమె కంఠస్వరం ఆ యింట్లో ఎప్పుడో గాని వినబడదు. అదీ అత్త — ఆడబిడ్డల పిలుపుకు జవాబు మాత్రమే. ఆమె మాట్లాడదని ఈ మాటకారులకు కోపం! కమల మాట్లాడటం మర్చిపోయింది.

ఎన్నాళ్లు ? ఎన్నాళ్లిలా గడవాలి—

భర్త యింటి కొచ్చి నాల్గు నెలలు దాటాయి. భర్త కోసం నిరీక్షించటం మానివేసి చాల రోజులైంది. ఆశతో అతని రాకకోసం నిరీక్షించే రోజుల్లో అతగాడు వచ్చి బల్లెంతో గుండెల్లో పొడిచినట్లు మాట్లాడి, ప్రవర్తించి కావలసినది పట్టు కెళ్లేవాడు. రాను రాను పరోక్షంగా భర్త రాకపోతేనే మంచి దనుకునేది. అతను వస్తాడు — వచ్చే రోజులు దగ్గర కొస్తాయనగానే కమలకు కంపరం పుట్టేది. భయంతో గజ గజలాడి పోయేది. గాలి దుమారం — గాలి వానలా వచ్చి నానా రభసచేసి క్షణాల్లో వెళ్లి పోతాడు. అతని రాక పోకల కేమాత్రం అడ్డు లేదు. కొడుకిలా నాశనం కావటానికి కారకురాలు కమలే అని వాళ్ల అభిప్రాయం. మరి పెళ్లికి ముందు కారకు లెవరో మాత్రం వాళ్లు ఎప్పుడూ అనలేదు.

ఎన్ని రోజులు గడిచి పోవాలి? ఇంకా ఎంత కాలం వోర్చుకోవాలి.

కమల కిక చేత కాలేదు. ఎవరికోసం బ్రతకాలి? ఈ ఇంటి చాకిరీ తప్ప వైవాహిక జీవితంలో తను అనుభవించింది ఏమీలేదు. ఆశించినవన్నీ స్వప్న జగత్తులో కలిసి పోయాయి. వర్షించని మేఘాల్లా తేలి పోయాయి. ఎందుకు బ్రతకాలి?

అమ్మ, నాన్న — తన సుఖం కోసం తమ కున్న ఆ నాలుగెకరాలు తనకిచ్చేశారు. ఉన్న దాన్లో గుట్టుగ గడువు కొస్తుంటే — మళ్లీ తన సౌఖ్యంకోసం అల్లుడు కోరినవి తాహతుకు మించిన వైనాసరే యిచ్చాడు. అన్నయ్యకు వయసు మించి పోతుంది. వివాహం చేసికోలేదు. తన కొచ్చే నూట ఏభై రూపాయలతో తలి దండ్రులనే చూస్తాడా, చెల్లెలి సంసారాన్నే నిలుపుతాడా, తాను పెళ్లాడి సంసార సాగరంలో మునిగి పోతాడా — ఎన్నని చేయ గలడు? అందుకని పెళ్లి చేసికోలేదు.

బి. ఎ. చదివిన కుర్రాడు. రూపంలో లోటు లేదు. తండ్రి తహసిల్దారు. బాగా ఉన్నవారే నని కమల జీవితం మూడు పువ్వు లారు కాయలు గా వర్ధిల్లా లన్న పేరాశతోనే అనందీ కూతురికి పెళ్లి చేశారు.

చెడుత్రోవలు బట్టిన వాడికి త్వరగా పెళ్లి చేయాలన్న ఆరాటం కొద్ది కమలను నిమిషాల మీద నిశ్చయించుకున్నారు. "మూడు తరాలకు సరిపడేటంత వుండగా —ఇంకా దేనికి? ఆ పొలం రాసిస్తే చాలు"— అని అన్నారు. సబ్ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న తండ్రికి బాగానే తోచింది. అంతకు మించిన పొలం కొనవచ్చు నను కున్నారు గానీ— కమల పెళ్లయిన ఏడాదిలోగానే గిట్టని వాళ్లు కేసు పెట్టారు — లంచాలు తీస్తున్నాడని. దాంతో రిజైన్ చేయవలసి వచ్చింది.

మారు మూల పల్లె జేరి తల దాచు కున్నారు.

తను అటు పోలేదు. అక్కడ ఏమీ లేదు. తనొక గుది బండ.

ఇక్కడ అంతకన్నా ఏమీ లేదు! కమల తీవ్రంగా ఆలోచిస్తోంది. అంతగా ఆమె ఎప్పుడు ఆలోచించలేదు. ఏమి జరిగిందో గాని కమల తనలో తాను లేదు.

అంతకు క్రితం రోజు భర్త నుంచి ఉత్తర మొచ్చింది.

ఎప్పటికి లాగానే సంబోధన లేదు. కానీ ఈ లేఖ ఘాటుగా వుంది.

"ఎల్లుండి తెల్లవారు జాము బండికి వస్తున్నాను. నీ నాల్గు ఎకరాలు బేరం పెట్టాను. వచ్చి—అమ్మి— సంతకాలు పెట్టించి డబ్బు తీసి కొని వెళ్లిపోతాను. ఇది ఆఖరు సారి..... ఇక నీ దగ్గర ఏమీ లేదను కుంటాను— పుస్తెలు తప్ప. నీతో అవసరం తీరిపోయింది. కాన నీవు మీ యింటికి వెళ్లి పోవచ్చును......"

"కట్టె — కొట్టె — తెచ్చె" అన్నట్లు ఎంత సులువుగా రాశారు? వచ్చి — అమ్మి — పెట్టించి — పోతారా? ఇంత వరకు మౌనం దాల్చింది. తను ఒక వేళ పుట్టింటి కెళ్లినా ఎవరాదుకుంటారు? తన కున్నదంతా ధారపోసినా తృప్తి లేదు — అవసరం తీరింది — ఒకప్పుడు మాత్రం ఏం అవసరం! తన వాళ్ల బాధలు తను చూడ లేదు. ఉన్నదంతా తనకోసం ఖర్చు పెట్టారు. భూమి తన కిచ్చారు— ఆ భూమిని అమ్మి అతని చేతిలో డబ్బు పోయాలా? తను — తనవారు పేదరికంలో— ఆకలి బాధలో మునిగి ఊపిరాడక బాధపడ్తుంటే అతను ఆ డబ్బుతో విలాసంగా ఎవతెకో మూట గట్టి యిచ్చి ఆ పాప పంకంలో కులాసాగా కొన్ని రోజులు గడుపుతాడా?

ఈ సారి తప్పక మారి పోయి వస్తారు. తనను భార్యగా గౌరవించి సంభావిస్తారు, అన్న ఆశను పెంచు కుంటూ గడపిన జీవితం మోడువారిందే గానీ ఎన్నిదినాలు గడిచినా పుష్పించ లేదు. ఎక్కడా ఆశా కిరణం ప్రసరించలేదు. రాను రాను జీవితం దుర్భరమై పోయింది. లాభం లేదు. తను ఒక నిర్ధారణకు రావాలి.

ఈ నరక కూపంలోంచి బయట బడాలి.

ఆ రాత్రి చాలాసేపు ఆలోచించింది. ప్రమిద వెలిగించుకుని ఆ దీప కాంతిలో సుదీర్ఘ లేఖ వ్రాసింది.

తను చేయవలసిన దేదో రేపురాత్రికి చేయాలి. అంతే ఆలసించి లాభం లేదనుకుని నిద్ర పోయింది కమల.

తెల్లవారి లేచింది. పెరట్లోకి వెళ్లటానికని లేచిన మామగార్కి నీళ్లందించింది. ఆయన రాగానే ఆ ఉత్తరాలు ఆతని చేతుల్లో పెట్టింది. భర్త తనకు వ్రాసినది కూడ అందులో వుంది.

ఆయన కోడలు కేసి విస్తు పోయి చూచారు.

"ఆ ఉత్తరాలు చూడండి. మీకు తోచినట్లు చేస్తే ఎంతో కృతజ్ఞురాల్ని" పంచె మడతల్లో అవి దాచుకుని ఆయన వెళ్లిపోయారు.

కమల హృదయం ఎంతో తేలిక పడింది. తనకు తెలుసు ఆ యింట్లో తన క్షేమం కాంక్షించేవారు ఒక్క మామగారేనని. వారి చేతుల్లో పెట్టింది. అంతా సవ్యంగా జరుగుతుందన్న దృఢ నమ్మకం తనకుంది.

ఆ వేళ అతి సాధారణంగా గడిచిపోయింది. కానీ కమలకు మాత్రం ఆ రోజు అసాధారణంగానే వున్నది. మరుసటి రోజు చేయవలసిన పనులు అత్తగారు యీ రోజే చెబుతోంది. కారం పొడి దంచాలి. మినపప్పు రుబ్బాలి. సామాను కొట్టు శుభ్రం చెయ్యాలి. కమల తనలో తాను నవ్వుకుంది. రేపటి మాట. రేపటికి తనెక్కడుంటుంది! ఈ కష్టాలకు అతీతంగా ఎక్కడో దూరంగా అతిదూరంగా, నిశ్చింతగా వుంటుంది. ఇక బాధలకు వేదనకు తను భయపడ నవసరం లేదు. భర్త వస్తాడని భయంతో కంపించ నవసరంలేదు. తెల్లవారి నాల్గుగంటలకు లేచి గృహ కృత్యాలలో నిమగ్నం కానవసరం లేదు. ఇన్ని రోజులుగా మారని జీవితం రేపటికి ఒక్కసారి తలక్రిందులౌతుంది. నాల్గు గోడల మధ్య నలిగిపోతున్న తను రేపటితో స్వేచ్ఛ పొందుతుంది. ఎంత హాయి. అది తలంచుకునే కొద్దీ కమల హృదయం ఎంతో తేలికపడింది. ఎక్కడ లేని సంతోషం హృదయాన్నావరించింది.

ఆ రాత్రి పదిగంటలకు తన గదిలో జేరి తలుపు వేసికొంది. దాంతో బాహ్య ప్రపంచంలో తెగ్గతెంపులు చేసికొన్నట్లు భావించింది. తనకున్న చీరల్లో శుభ్రమైన చీర కట్టుకుంది. తల దువ్వుకుంది. గోడకు వ్రేలాడుతున్న జానెడు అద్దంలో ముఖం చూచుకుంది. ఎన్నాళ్ళైంది తను తన ప్రతిబింబాన్ని పరీక్షగా చూచుకుని. తన అందం ఏమైంది? ఆ కళ్లలోని తళుకు, ఆ కపోలాలల్లోని కెంపులు, ఆ పెదిమల మీది అరుణిమ, ఆ చిన్ని నునుపైన గడ్డం మీది లావణ్యం ఉషఃకాలారుణ రేఖల్ని ప్రతిఫలింపజేసే ఆ స్నిగ్ధ ఫాల భాగం ఈ ఐదు సంవత్సరాల సాంసారిక జీవితంలో అవన్నీ కరిగిపోయాయి. మిగిలింది కనబడని హృదయం, ఎముకలు. కనిపించే చర్మం ఎండిపోయి నిర్జీవంగా వున్న తన ముఖంలో ఒక్క బొట్టుకే జీవం వుంది. కళకళలాడుతుందా లలాట భాగంలో. కుంకుమను చంద్రబింబంలా దిద్దుకుని ఆమె పడుకుంది. అమ్మ, నాన్న, అన్నయ్య కళ్లలో మెదిలారు. ఇప్పటికి తనవారికి విష్కృతి. ఇంతటితో అన్ని సమస్యలు తీరిపోతాయి. హృదయం ప్రశాంతమైంది. భగవంతుని ధ్యానిస్తూ కళ్లు మూసుకుంది.

ఆ కళ్లు మూయటం తెల్లవారినా మెలకువ రాలేదు. ఎలా వస్తుంది! ఆమె సుదీర్ఘ నిద్రలో మునిగి వుంది.

అత్తగారి కేకలు అధికమైనై. "వాడొస్తాడని ఏమన్నా భయముంది. అందుకే ఇదంటే వాడికంత ఏవగింపు, భర్తను అదుపులో పెట్టుకోగల శక్తిలేని ఆడది ఒక ఆడదేనా? ఎప్పుడూ ఏడుపు మొగమే. దరిద్రమంతా దీంతోనే వచ్చింది. తలుపు దియ్యవేమే..." దాదాపు పావు గంటసేపు అరచినా లాభం లేకపోయింది. "ఈ వేళ నీ రక్తం కళ్ల చూడకపోతే అప్పుడను.." ఆమె కదిలింది. కమల యింతసేపు అంత ధైర్యంతో తలుపు గడియ తీయలేదని మామగారు అనుకోగానే ఏదో స్ఫురించింది. చటుక్కున లేచి కూచున్నాడు. నుదురంతా చెమటతో తడిచిపోయింది. గుండెలు దడ దడ లాడాయి. అడుగు పడలేదు. మంచం మీద అలాగే కూచున్నాడు. ఈసారి కమల గది తలుపు కూతురు బాదుతోంది.

అతని ఆయాసం అధికమైంది. "ఇదిగో...ఇలారా.. కమల నీతో ఏమైన చెప్పిందా? వాడు ఈ బండి కొస్తాడుట.."

ఆమె లోపల్నుంచే జవాబిచ్చింది. "ఆ..చెప్పింది.. పొలం బేరం పెట్టినట్లు చెప్పింది. దీంతో లేని సుఖం దాని పొలం

మంచి వస్తుంది...అంతే..

వంటింట్లో ధనధనమని గిన్నెల చప్పుడు.

ఆతడు ధైర్యం చేసి లేచి నుంచున్నాడు. వెళ్లి తలుపు దగ్గర కెళ్లి ఆప్యాయంగా పిల్చారు. "కమలమ్మా తలుపు తీయి తల్లీ" కూతురు తండ్రి కేసి వెగటుగా చూచింది. "నువ్వు రావాలా నాన్నా. ఎవరైన చూస్తే నవ్విపోగలరు. ఆవగాత్రం మేము తేపలేము" అంది మూతి చేతులు త్రిప్పుతూ.

అత్తగారు లోపలినించి దూసుకు వచ్చింది. "సిగ్గులేదూ. దానికి లేకపోతే.. ఛీ..ఛీ..అవ్వ.. మామగారితో వందిమాగతులు..."

భార్యను మాట్లాడ నివ్వలేదు. ఆయన మౌనంగా వుండదల్చుకోలేదు. "గొడవ చెయ్యకు..ఇలారా..చూద్దాం.." భార్య చెం గట్టిగ పట్టుకుని సామాను కొట్టులోకి తీసుకెళ్లాడు. ఆ గదిలోంచి కమల గదికి వెళ్లటానికి తలుపుంది. అది రెండువైపుల గడియ వేసుంటుంది గానీ తలుపుకు సందులున్నాయి. ఆమె ఆత్రంగా చూచింది. మంచం మీద కమలలేదు!

ఆమె నోటమాట రాలేదు. గుండెల





ఎంత వ్యత్యాసమో! మెరయుచుండే తెలుపు! నిష్కళంకమైన శుభ్రత! ఇది యెల్లశుద్ధల కొలదీ మరగ గల సర్ఫ్ యొక్క ఉతికే అధిక శక్తివల్లనే. మీ ఉతుకును చాలా సులభం చేస్తుంది. మీ బట్టలన్నిటినీ ఉతుకుటకు సర్ఫ్‌ను వాడండి ... పిల్లల బట్టలు, షర్టులు, చీరలు, ప్రతిదీ. సర్ఫ్‌తో ఇంట్లో ఉతుక్కోండి!

**సర్ఫ్ అమిత తెల్లగా ఉతుకును**

SU. 45-140 TL

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

మీద చేతులుంచుకొని భయవిహ్వలయై భర్తకేసి చూచింది. ఆయన చూచారు. ఔను కమల లేదు. ఆ కన్నంలోంచి కనబడే గదిలో కమల జాడలేదు. ఇద్దరు మసక వెలుతుర్లో సరిగా అగుపించటం లేదేమో అని పెరటి వైపుకు పరిగెత్తారు. కమల కిటికీ తలుపులు మూసి వున్నాయి. అటు వేపు నించి కిటికీ రెక్కలు పగులగొట్టి చూచారు. ఆ హడావిడికి ఇద్దరు ముగ్గురు పొరుగు వాళ్లు చేరారు. కమల ఏమైంది? అందరూ అత్తగారి కేసి అనుమానంగా, చూస్తున్నారు!

ఆ కిటికీ కన్నంలోంచి చూచారాయన. కమల గోడ వైపు మంచం అవతల నేల మీద పడివుంది. ఆమెలో చలనం లేదు.

ఆయన రెండుచేతుల్లో ముఖాన్ని కప్పుకుని 'తల్లీ కమలా..'అంటూ హృదయం ద్రవించి పోయేలా రోదిస్తూ ఇవతలి కొచ్చారు.

అత్తగారు శిలాప్రతిమయై మెట్ల మీద కూచుని వుంది. ఆమె చూపులు భయంతో నిండి వున్నాయి.

తలుపులు ఎలాగో తెరచి లోపలికి ప్రవేశించారు. కమల నిశ్చలంగా పడి వుంది. ఎవరో బండి కోసం పరిగెత్తారు. ఈ లోపల గదినంతా కలియజూచారు.. మంచం క్రింద చెంబు, గ్లాసు వున్నాయి. వాని ప్రక్క నిద్ర మాత్రల సీసా వుంది. ఆ సీసా అంతా ఖాళీ! అది చూచిన మామ గారు గుండెలు బాదుకుంటూ కూచున్నారు. ఎవరో తలగడ ఎత్తారు.

"నేను ఆత్మహత్య చేసికొంటున్నాను. నా మరణానికి ఎవ్వరు బాధ్యులు కారు." కమల. అని వ్రాసిన వుత్తరాన్ని మామ గారి చేతిలో పెట్టారు.

ఆయన దాన్నందుకుని భార్య చేతి కిచ్చాడు.

ఆమె శాపనార్థాలు మొదలెట్టబోయింది...కానీ భర్త నుదురు బాదుకుంటూ "నోర్ముయ్" అని బిగ్గరగా అరిచేసరికి నేల మీద చతికిలబడింది. కమలను హాస్పిటల్‌కు తీసికొని వెళ్లారు. కూడా ఆడ బిడ్డ వెళ్లింది. ఆమె వున్న చోటు వదల్లేదు. దుఃఖం రావటం లేదామెకు. ఏదో భయం అతి భయంకరమైన పరిణామం గుర్తొస్తోంది. అచేతనంగా గుమ్మం కేసి చూస్తూ కూచుంది.

రిక్షా గుమ్మంలో ఆగింది. కొడుకు లోపలికి రావటం చూచి ఆమె లోపలి కెళ్లి

# నేను ఓడిపోలేదు

పోయింది. తల్లి అలా వెళ్లటం అతనికి చాల వింతగా వుంది. ఇల్లంతా గందరగోళంగా వుంది. తండ్రి మంచం సర్ది లేదు. ఈజీచైర్‌లో కూచుని తను రాగానే "హు, వచ్చావా" అని అసహ్యించుకున్నట్లు ముఖం త్రిప్పుకునే తండ్రి అక్కడలేదు. హమ్మయ్య అని ఎంతో స్వేచ్ఛగా ఫీల్ అయ్యాడు. గోడ వారగా సంచిని ఆనించి గబగబ కమల గది అంటే తన గదికి వెళ్లాడు. ఆగది కూడ చిందరవందరగా పడేసిన వస్తువులతో నిండి వుంది. కమల పెట్టె తెరచి చూచాడు. ఏవో నాలుగైదు సాధారణమైన చీరలు, రవికెలు వున్నాయి. పెట్టె అడుగున చూచాడు. ఏమీలేదు. ఓ చిన్న కాగితం ముక్క కూడ లేదు. ఆశ్చర్యంగా అల్మారీలో చూచాడు. ఏనాటివో మేగజీన్లు, నవలలు, ఏవో వస్తువులున్న ఆ స్థలంలో కూడ ఏ ముఖ్యమైన కాగితాలు కనబడలేదు. పుస్తకాల చాటున రూపాయి చిల్లరుంది. కసిగా నవ్వుతూ వాటిని జేబులో వేసికున్నాడు. ఈ రూపాయ చిల్లర మాత్రం తనకెందుకు? కాగితాలు అంటే పత్రాలు కనబడకపోయేసరికి అతడి కెక్కడలేని కోపం ముంచుకొచ్చింది. "కమలా, కమలా" అని కేకేశాడు.

కమల రాలేదు గానీ ముందు ఎవరో పిలుస్తున్నారు.

తల్లి నీరసంగా అరచింది. "ఎవళ్లో వచ్చారు చూడరా..."

చికాకుగా ఇవతలికొచ్చాడు. గుమ్మంలో నుంచున్న పోలీసుల్ని చూచి మానుపడి పోయాడు.

"ఇది రిటైర్డ్ తహసిల్దారు లక్ష్మీ ప్రసాద్ గారిల్లేనా అండీ?"

"ఔను..ఏంకావాలి?"

తల్లి వాళ్లను చూచి బేంబేలు పడి పోయింది. "ఒరే ఒక్కమాటిలారా" అంది తలుపు చాటునించి. చరచర వెళ్లాడటు కేసి "ఆ కమలది నిద్రమాత్రలు మింగిందిరా... చచ్చిపోయి సాధిద్దామనుకుంది. హాస్పిటల్‌కి తీసుకొని వెళ్లారు...."

కమలకు అంత ధైర్యం వుందా? అంత సాహసించిందా. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"చూడండి ఆమె గదికి తాళం వేసి సీలు వేయాలి. తర్వాత మా ఇన్‌స్పెక్టర్ గారొస్తారు."

వారా గదిలో కెళ్లి చుట్టూరా పరీక్షగా చూచారు. మంచం, ఒక ట్రంకు, గ్లాసు చెంబు తప్ప అక్కడ ఏమీలేవు. చెక్క ముక్కలు, మేకులు, కిటికీకి ఇవతల పడి వున్నాయి. కిటికీ మూసి రెండు బొంగు లడ్డం పెట్టి తలుపు తాళంవేసి సీలు జేశారు.

వారి పనులన్నీ చేస్తుంటే పరధ్యానంగా చూస్తున్న అతడికి — కమల భర్త సత్యమూర్తికి— ఏదో ఆలోచన చటుక్కున తట్టింది.

"నే నిప్పుడే వచ్చాను. ఏ ఆస్పత్రిలో వుంది? ప్రాణాపాయం లేదుకదా!" ఆత్రతతో ప్రశ్నించాడు.

ఒక పోలీసు అన్నాడు "ఏమో చెప్పలేము. డాక్టర్లు ఇంకా ఇంజక్షన్లు ఇస్తున్నారు...ఆమెకు స్మృతి వచ్చేదాక అనుమానమే."

"అమ్మా..నేనటు వెళ్లొస్తాను" జేబులోని దువ్వెనతో తల దువ్వుకుంటూ వెళ్లి పోయాడు. ఎప్పుడు లేనిది కొడుకు హడావిడికి ఆశ్చర్యపోయిందామె. లోకం కళ్లు కప్పటానికి కాబోలు! ఆమె గబగబ గుమ్మంలో కెళ్లి "ఒరే ఓ మాటిలారా" అంది. కొడుకు రాగానే రహస్యంగా అంది.

"దాని కేమాత్రం మెలకువ వచ్చినా నీ పేర రాయించుకో".

తల్లి కళ్లలోకి సూటిగ చూస్తూ నవ్వాడు. "ఆమాత్రం నాకు తెలీదూ?" అన్నట్లుందా నవ్వు.

"ఆ గదిలో కెవ్వరు పోకండమ్మా. తాళం వేశాము" అంటూ వాళ్లిద్దరు వెళ్లి పోయారు.

లక్కడ ఆమె కేమీ తోచలేదు. తలుపు తాళం వేసి తానూ బయలుదేరింది. అక్కడ చాల హడావిడిగా వుంది. ఇద్దరు ముగ్గురు పోలీసులు తిరుగుతున్నారు. పేషెంట్ల బంధువులంతా కొద్ది దూరంలో నుంచుని ఈ జగన్నాటకాన్ని చూస్తున్నారు.

"ఆ అవిడే కాబోలు అత్తగారు. ఎంతుందో"

"కూతుర్ని చూచారుగా.. వీళ్లిద్దరూ పాపం రాచి రంపాన బెట్టుంటారు."

"ఆ కట్టుకున్న వాడే కసాయివాడైతే వీళ్లకు మరీ లోకువైయ్యుంటుంది. అందుకే పాపం ఆత్మహత్యకు పాల్పడింది."

ఒక్కోమాట వారి చెవి సోకుతూనే వున్నాయి. "వీళ్లకేం పోయేకాలమో. మా గొడవలన్నీ వీళ్ల కెందుకూ..మహా అర్చే

వాళ్లలా తీర్చేవాళ్లలా" ఆమె తీక్షణంగా వారికేసి చూస్తూనే భర్తతో అంది. కాసేపాగి మెల్లగా అంది.

"ఎలా వుందేమిటి దానికి?"

"నాడి బాగుందట.. ఇంకా స్మారకం రాలేదు. చాల శ్రమపడుతున్నారు"

"అతనెవరు?" వరండాలో గది బైట కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూస్తూ అడిగిందామె.

"మేజిస్ట్రేటుగారు. మెలకువ వస్తే వాజ్ఞ్మూలం వ్రాసుకోటానికి వచ్చారు" ఆయన కొడుకు వైపు చూచారు. అతగాడు హడావిడిగా కాగితం మీద ఏదో రాస్తున్నాడు! ఆయన బెంచి మీద కూచుని రెండు చేతుల్లో తల పట్టుకున్నాడు. కమల బ్రతకాలి. అదొక కళంకంగా తమ వంశంలో నిలువరాదు. బ్రతికి ఎక్కడైన హాయిగా వుండాలి. ఆతడు భగవంతునికి మ్రొక్కుకుంటున్నాడు. అతనికి బాహ్యప్రపంచం మాటుబడిపోయింది. మనస్సంతా కమల మీద కేంద్రీకరింపబడి వుంది. తనూ ఒక మనిషేనా? కమల చచ్చిపోతే అందుకు కారకుడు తను మాత్రం కాదూ? ముగ్గురు చేరి ఆమెను హింసిస్తుంటే తను చూస్తూ ఎలా వూరుకోగల్గాడు? ఆమాత్రం ధైర్యం తనకు లేకపోయిందా? అంతగా అంటీ అంటనట్లు చూచీ చూడనట్లు పరాకుగా ఎలా వుండగల్గాడు. ఛీ. ఛీ..తను కూడ వీళ్ళ రాక్షసత్వంలో పాలుపుచ్చుకున్నాడు. ఆ పాపంలో భాగస్తుడు కూడా.. వాళ్లంతా ఆమెకు చేయరాని అపకారం చేస్తుంటే కూడ తనలో ఏ విధమైన భావావేశాలు ఉద్భవించలేదు. ఎవ్వరినీ అదుపులో పెట్టలేకపోయాడు. తను చవట. చేతకానివాడు. ఎన్నో సంవత్సరాల లోకజ్ఞానం పరిస్థితుల ప్రభావానికి లొంగిపోయింది. మంచికి బదులు చెడు జరుగుతున్నా అది సహజమైనట్లూరుకున్నాడు. అగ్నికి కాల్చే గుణం, భార్యకు కోడల్ని సాధించే గుణం, కొడుక్కు భార్యను పీల్చి పిప్పిచేసే గుణం. కూతురికి వదినను చిన్నచూపు చూచి ఆమె దుఃఖిస్తుంటే చూచి ఆనందించే గుణం, ఇవన్నీ చూస్తూ కూడ నత్త గుల్లలో దాక్కున్నట్లు తను అన్నింటికీ అతీతంగా దూరంగా వుండటం సహజమైన దనుకొన్నాడు. అంతరాత్మ ఘోషిస్తుంది. కనుకొనల్లోని కన్నీరు, అటు ఇంకిపోక ఇటు జారలేక







స్టాకిస్టులు సిటీ ఫార్మ డిస్ట్రిబ్యూటర్సు, రాంగోపాల్ వీధి. విజయవాడ-1.



ప్రతిభవించినట్లుంది. అతని హృదయం తీరని వేదనకు సలుగుతోంది!

ఒక నర్స్ హడావిడిగా వచ్చి "ఆమెకు కొన్నిగ తెలివొచ్చింది. స్ట్రాంగు కాఫీ గానీ డికాక్షన్ కానీ ఇవ్వాలి. త్వరగా తేవాలి..." ఆమె వచ్చినంత హడావిడిగా వెళ్ళిపోయింది.

కళ్ళలోని అశ్రువులు టపన రాలాయి. చల్లనిగాలికి నల్లని మేఘాలు వర్షించి నట్లే ఆ వార్త అతని కెంతో హాయి నిచ్చింది. కళ్ళు తుడుచుకుంటూ కాఫీ చేయటానికి లేచాడు. "నేను వెళ్తాన్తాను నాన్నా..." అంటూ కొడుకు దౌడుతీస్తుంటే అర్థంకాక గ్రుడ్లప్పగించి చూస్తున్నాడు. ఏదో చటుక్కున స్ఫురించటంతో పెదవి విరిచి తన స్థానంలో కూచుండిపోయాడు.

"నే వెళ్ళి చూచిరానా?" భార్య ప్రశ్నించింది.

"ఎందుకులే. నిన్ను చూస్తే వచ్చేది కాస్త ప్రాణం...." అతను పూర్తి చేయకుండానే చేతితో పోతుందన్నట్లు అభినయించాడు. ఇష్టపూర్వకంగా ఆమె వైపు చూడలేదు.

"ఏతే మేమెందుకిక! ఆ వచ్చేప్రాణం వచ్చాక నాల్గు చివాట్లు పెట్టి బుద్ధిగా వుంటే రమ్మను మనండి..లేకపోతే ఇంకాస్త ఎక్కువ డోసేసుకుంటే యీ అందోళన అప్రతిష్ఠ లేకపోవును..ఛీ..ఛీ.. ఎంత అవమానం.. తలెత్తుకు తిరగ్గలనూ!"

ఆయన జవాబు చెప్పదల్చుకోలేదు.

చేతులు కట్టుకుని నేలకేసి చూస్తూ కూచున్నారు.

# నేను ఓడిపోలేదు

ఆమె భర్తకేసి తీక్షణంగా చూచి కూతుర్ని తీసికొని వెళ్ళిపోయింది. వెంటనే కాఫీ తీసికొచ్చాడు కొడుకు. నర్స్ లోపలికి తీసికొని వెళ్ళింది.

"ఎలా వుందట నాన్నా"

అతను కొడుకు దెస చూడలేదు "పూర్తిగా తెలివి రాలేదుట.. అర్థరహితమైన మాటలు. పొడిపొడిగా ఏదో అంటూందట..."

మరొక గంటకు గాని కమలకు కాస్త తన ఉనికి తెలిసింది కాదు. మామగార్ని చూడగానే కన్నీరు ఆగింది కాదు.

"ఎంత పని చేశావమ్మా కమలా!..." అంటూ అంగవస్త్రంలో ముఖాన్ని దాచుకున్నారు. ఆమె మాట్లాడలేదు. కళ్ళు మూసుకుంది. ధారగా అశ్రువులు చెంపల్ని తడుపుతున్నాయి.

"నిద్ర పోనివ్వ కూడదు..ఈ మాత్రలతో పాటు కాఫీ యిస్తుండాలి.. ఆవేశపర్చకండి..." నర్స్ చెప్పింది.

సత్యమూర్తి నెమ్మదిగా లోపలికొచ్చాడు. అతని ముఖం పైకి ప్రశాంతంగా వుంది. అంతరాంతరంలో కమలపై కోపం బడబాగ్నిలా మండుతోంది! భర్తను చూచి కళ్ళు మూసుకోలేదు సరికదా భయంతో మామగారి అండకోసం అటువైపు దీనంగా చూడలేదు. భర్త కళ్ళలోకి సూటిగా చూచింది. నర్స్ కొద్ది దూరంలో నుంచుంది. ఏమీ పట్టనట్టున్నా ఓ చెవి ఇవతల పారేసింది.

"ఎలా వుంది" స్టూలు మీద కూచుని అనురాగంతో ప్రశ్నించాడు.

"నీరసంగా వుంది"

"మగతగా లేదా? మేమంతా ఎవరో తెలుస్తోందా!" కమల నవ్వింది. ఆ నవ్వు ఎంత హేళనగా వుంది! తన్ను తాను పూర్తిగ స్వాధీనంలో వుంచుకోలేని స్థితిలో వుంటం చేత ఆ నవ్వు వింతగా ధ్వనించింది! అతని భృకుటి చూచి ఆమె చలించలేదు.

"ఎందుకింత పని చేశావు?" కఠినంగా ప్రశ్నించాడు.

"మీకు తెలుసుగా? నేనే చెప్పాలా? నన్ను నేను మోసగించుకోలేకపోయాను. బ్రతికి బాగుపడేందుకు యోగం లేనప్పుడు చని పోవటం మంచిదనుకున్నాను... మీకూ మంచిదేగా!"

కమల ఎంత ధైర్యంగా మాట్లాడుతుంది! ఎప్పుడు కూడ పల్లెత్తు మాట అనని ఈమె, తన సముఖాన నోరు తెరచి మాట్లాడలేని ఈ కమలేనా ఇంత ధైర్యంగా జవాబు లిస్తోంది. అతడు ఆశ్చర్యాన్ని కప్పి పుచ్చుకునాడు. తనకు అట్టే వ్యవధి లేదు. సాయంత్రం నాల్గుగంటల కెళ్ళిపోవాలి. ఆ డబ్బు చేతిలో పడగానే "ఆమె కివ్వాలి. "ఆమె" భవనంలో బాత్ రూమ్ ఆధునిక పద్ధతిలో నిర్మింపబడ్తోంది. క్రొత్త కారుకు కొంత డబ్బు తక్కువ బడింది. అదంతా భర్తీ చేయువలన బాధ్యత తనది కాదూ!


"ఇక నిన్ను ఏ విషయంలో గూడ కష్టపెట్టను కమలా. నీ కెక్కడ వుండా లని తోచితే అక్కడే వుండు. నాకే అభ్యంతరం లేదు. నిన్నెంతగా హింసించి శ్రమ పెట్టానో తలంచుకుంటే నా హృదయం తీరని వేదనకు లోనౌతుంది. త్వరలో ఆరోగ్యం పొందితే ఎంతైనా కృతజ్ఞుడిని."

కమల మళ్ళీ నవ్వింది.

"నా దగ్గ రేముందని? అంతా అయిపోయింది..." స్మృతి తప్పుతున్న స్వరంలో అంది.

"అంత నిరాశగా మాట్లాడకు. నీకు తప్పక బాగవుతుంది. రెండురోజుల్లో యింటి కొస్తావు..."

"ఔను..నాకు కూడ త్వరగా యింటికి రావాలనే వుంది..కానీ వీళ్ళు రానిస్తారూ?" కిటికీకి అవతలగా చూచింది. వీళ్ళు అంటే ఆసుపత్రి వాళ్ళా? కాదు.. కమల కిటికీ లోంచి అగుపిస్తున్న ఎర్రటోపి కేసి






చూస్తోంది. అతని ఒళ్ళు గగుర్పొడిచింది!

కమలకు మత్తుగా వుండనటంలో తిరిగి మందులు కాఫీ ప్రారంభించారు. నిద్రపోకుండా సత్యమూర్తి జాగరూకతతో కనిపెట్టి వున్నాడు.

ఆ రోజు, మరునటి రోజు ప్రొద్దున్న గడిచిపోయాయి. కమల మంచం మీద కూచుని తల దువ్వుకుంటుంది.

పదిగంటలకు సత్యమూర్తి టిఫిన్ పట్టుకొచ్చాడు. పళ్ళెంలో వడ్డించిన వేడి వేడి అన్నంలో వేసిన నెయ్యి ఘుమాయించి కమ్మని వాసన కొడ్తోంది. రెండు వేపుడు కూరలు, పప్పుపులుసు, గ్లాసులో పాలు చూచి కమల నిర్ఘాంతపోయింది. పండగ లప్పుడు కూడ యిలాంటి భోజనం తను చేయలేదు. సరిగ్గా వేడివేడి అన్నం తిని సంవత్సరాలే అయింది.

అన్నం కలపకుండా భర్త ముఖంలోకి పరీక్షగా చూచింది. ఆ చూపులు అతన్ని ఛేదించి హృదయాన్ని చొచ్చుకునిపోయినట్లు భావిస్తూ ఏదో పని మీద వెళ్ళినట్లు బైటికెళ్ళిపోయాడు. ఆమె ముఖం కొద్దిగా వికసించింది. కమల కొద్దిగ భోంచేసి చెయ్యి కడుక్కుంది. టిఫిన్ సర్ది పెట్టింది. మామగారు పోలీసు ఆఫీసరు లోపలికొచ్చారు. వాళ్ళు ఏదో మాట్లాడుకొంటున్నారు. సత్యమూర్తి భార్యతో పనుందనగానే వాళ్ళు బైటికెళ్ళారు. అతను పత్రం దెచ్చి కమలకిస్తూ సంతకం చెయ్యమన్నాడు. గొలుసుకట్టులో వ్రాసిన ఆ తెలుగు చదవటం ఆమెకు చేతకాలేదు. కాగితం మొదలునుంచి తుది వరకు శ్రద్ధగా చూచి తిరిగి యిచ్చివేస్తూ "నేను పెట్టను" అని స్పష్టంగా అంది. తలుపు కవతల నించి ఎవరో తొంగి చూస్తున్నారు. సత్యమూర్తి తల మీద పిడుగు పడ్డట్లయింది. నిప్పులు గ్రక్కుతున్న కళ్ళతో ఆమె కేసి క్రూరంగా, కోపంగా, అసహ్యంగా, జుగుప్సాకరంగా చూచాడు.....

"పెట్టకపోతే... హు..ఆ పత్రాలెక్కడున్నాయి?"

కమల తొణక లేదు. "మామయ్యగారి దగ్గరున్నాయి"

"తీసుకుంటాను."

"మీ కివ్వరు.. వారి ద్వారా చేరవలసిన వారి కీపాటికి చేరే వుంటాయి."

"ఎవరికి పంపావు?" క్రోధానికి ఆ గది కంపించినట్లుంది.

"మా యింటికి.."

"ఆ... వెళ్ళి... ఏమైనా గాని తెచ్చుకుంటాను...నా కసి తీర్చుకుంటాను" పళ్ళు బిగించి మాట్లాడుతుంటే కమల ఏమీ పట్టనట్లు ఏలకి తొక్క తీసుకొని నోట్లో వేసుకుంది.

"వాటిపై మీకేం హక్కుంది?...మీరు తీసికోలేరు... బెదరించినా మీకు రావు, ఎందుకంటే అవి నాన్నారి పేరట వున్నాయి.."

ఆతడు ఆగ్రహంతో లేచి నుంచున్నాడు. చేతిలో ఏదైన వుంటే యీసరికి ఆమె విగత జీవియై నేల మీద పడిపోయేది. కుడిచేయి పిడికిలి ఎడమచేతిలో గుద్దుకుంటూ ప్రతీకార వాంఛ భయంకరంగా కళ్ళలో తాండవం చేస్తుంటే లేచి నుంచుని అన్నాడు..."ఐతే చావకపోయావా? విను.. నీకూ.." కమల చటుక్కున లేచి నుంచుంది. ఆతని మాటల కడ్డు తగులుతూ కసిగా అంది.

"ఆ ముక్క నేనే అందామనుకుంటున్నాను.. ఇక మనిద్దరికి సంబంధం లేదు.. నేను రేపే తిన్నగా మా యింటికెళ్తున్నాను... ఎక్కడికో వెళ్ళి అడుక్కుతినమనేగా మీ అభిప్రాయం! అంత అవసరం నాకే మొచ్చింది? లక్షణంగా ఆ పొలం మీది ఆదాయంతో ఎక్కడో హాయిగా బ్రతగలను. అంతా అయిపోయి చేతులు కాలాక పశ్చాత్తాపృలై తిరిగొచ్చి ఏలుకోవాలనుకుంటున్నారు కాబోలు. అంత కాలం ఆగటానికి ఓపికా త్యాగబుద్ధి నాలో లేవు."

సత్యమూర్తి మానుపడి చూస్తుండిపోయాడు. అనవలసిన మాట అనేసింది. ఈ క్షణం కోసం ఎంతగానో ఎదురు చూచింది. అంత ధైర్యం ఎక్కడి నించి వచ్చిందో తనకే తెలియదు. తుపాకి పేల్చింది. ఆ గుండు ఇక వెనక్కిరాదు!

"ఆమె"కు తన ముఖం ఎలా చూపగలడు? కమల ఇంత ధైర్యం చేస్తుందనుకోలేదు. ఎప్పటిలాగానే బెదిరిస్తూ వ్రాసిన ఉత్తరానికి బాగానే సిద్ధపడింది. ఆ కోపంతో అక్కడ వుండలేక గబగబ వెళ్ళిపోయాడు.

ఆతడు వెళ్ళిన దిక్కు కేసి చూస్తూ రెండు చేతులతో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది కమల.

వాళ్ళు లోపలి కొచ్చారు.

కమల ముఖం తుడుచుకుని మంచం మీద కూచుంది.

ఆతను జాగు సేయలేదు. "ఏమ్మా.. మీరు ఆత్మహత్యకు పూనుకున్నందుకు నేర



# నేను ఓడిపోలేదు

రోపణ చేయటానికే వచ్చాను...నాకు వివరాలు కావాలి'' అతను పుస్తకం తెరిచాడు.

కమల దిగ్భ్రాంతయ్యి మామగారికేసి చూచింది. తను ఓడిపోకూడదు. విజేతయ్యి అందరికీ, ముఖ్యంగా భర్తకు తన శక్తి చూపాలి. ఆమె ఆలోచిస్తోంది.

''ఆత్మహత్య మహాపాపం... ఈ శరీరం మీది కాదు.. సృష్టించిన ఆ భగవంతుని అంశం.. దాన్ని మీ యిచ్ఛాప్రకారం అంతం చేయటానికి హక్కులేదు. దీన్ని మీరితే మేము శిక్షిస్తాము.. ఇది సంఘపు కట్టుబాట్లకు విరుద్ధం. దుష్కార్యాన్ని శిక్షించకుండా వదిలేస్తే లోకం సహించదు..''

కమల శాంతంగా అతని కళ్లలోకి చూచింది. ''సంఘం మీరు.. ఇంత కాలం ఎక్కడున్నారు? ఇప్పుడు నా భర్త నన్ను త్యజించి వెళ్లారు..సంఘం ఏదీ? ఈ ఐదు సంవత్సరాలు జలగ రక్తం పీల్చినట్లు నన్ను పీల్చితే మీరంతా ఏమైపోయారు? చివరికి నేను బికారిని అయ్యే పరిస్థితులు వస్తే ఏం చేశారు?...కానీ.. బాబూ.. ఒక్క మాట.. నేను ఆత్మహత్యకు పూనుకోలేదు. నేనేం పాపం చేశాను? ఈ పృథ్విలో తలెత్తుకు తిరగ్గల స్తోమత వున్నప్పుడు నేనెందుకు భయపడాలి? లోకానికి వెరచి సిగ్గుతో చచ్చిపోవలసినంత ఖర్మ నాకేం పట్టింది.. నేను చనిపోవాలనుకోలేదు.. చావటం నాకూ ఇష్టంలేదు..''

''అలా అంటావేమ్మా.. ఈ ఉత్తరం నువ్వు రాయలేదూ? ఈ మాత్రలు సీసా నీవి కావూ? నీ మంచం దగ్గరుంటే తీసుకున్నాము. ఒక మాత్ర తలగడ దగ్గరుంది.. అన్ని మాత్రలు వేసుకోవటంలో నీ అర్థమేమిటి? చదువుకున్న దానివి.. డోసు చదవ లేదా?'' నన్ను మోసంజేస్తావా? అన్నట్లు మాట్లాడుతున్నాడు.

కమల తలొంచుకుని అంది. ''అన్ని మాత్రలు వేసికోలేదు. నాల్గు మాత్రం వేసికొన్నాను. మిగిలినవన్నీ చిన్న డబ్బాలో పెట్టి మల్లెపందిరి మీదికి విసిరి వేశాను. అంతేకాదు. మా తండ్రిగార్కి రాసిన లేఖలో ఇదంతా నాటకమేనని, నిష్కృతి కోసం యిలా చేస్తున్నానని రాశాను.. ఇంత చేసినా డోసు ఎక్కువైంది. నా భర్త భయపడి ఏమైన మారిపోతారేమోనని ఆశించాను.. కానీ నా శ్రమ వృథా అయింది. వారేం మారలేదు. పైగా డబ్బులేని నన్ను ఏలుకోటానికి కూడ వారికి మనసు లేదు. కేవలం బ్రతికితే పొలం రాయించుకుందామన్న కాంక్షతో నా స్వాస్థ్యం కోరారు. అంతేగానీ, ఆత్మహత్యకు పూనుకుందే! ఇప్పటికైన మనస్సాక్షి మేల్కొంటే యీ చెడు త్రోవలను త్యజిస్తాను అని అనుకోలేదు. దీర్ఘనిద్ర నించి మేల్కొంటే, నా జీవిత గతి మారుతుందనుకున్నాను.. నూతన జీవితంలో అడుగు పెడ్తానేమో అని వువ్విళ్ళూరాను.. అంతా వృథా.. ప్రాణంపోయినా బావుండుననిపిస్తోంది!.. నాన్నగా రొస్తుండాలి.. వెళ్లిపోతాను.. బాబూ ఇది రహస్యంగా వుంచండి. ఎన్నో ఆశలు పెట్టుకున్నాను గానీ అడియాశలైపోయాయి. ఎక్కడో ఒక దగ్గర జీవిత శేషాన్ని గడుపుతాను. కాదు కూడదు శిక్ష అనుభవించాలంటే...''


ఆమె కంఠం రుద్ధమైంది. కన్నీరు సుళ్లు తిరుగుతుంటే కంపిస్తున్న అధరోష్ఠాలను శల్యహస్తాలతో మూసుకుంటూ నిశ్శబ్దంగా రోదిస్తోంది...

మామగారు అతని చేతులు పట్టుకున్నారు. ''పెద్దలు ఏదో విధంగా మీరు తప్పించగలరు. ఇంతవరకు అమ్మాయి సుఖపడింది లేదు. ఇంకా బాధించటం న్యాయమంటారా?.. మీరు రక్షించాలండీ బాబూ'' అంటూ కంట తడిపెట్టారు. ఆయన రెండుచేతులు కట్టుకుని దీక్షగా నేలకేసి చూచారు. తర్వాత దుఃఖంతో విలవిల్లాడిపోతున్న ఆ ఎముకల గూడు కేసి చూచి దీర్ఘంగా నిశ్వసించారు. డాక్టరు అప్పుడే వచ్చి కూచున్నారు.

''ఆ మాత్రలు నిజంగా ప్రాణాపాయం కల్గించి వుంటే...?'' ప్రశ్నించా డాయన.

కమల జీరబోయిన కంఠంతో అంది. ''చనిపోయినట్లైతే మా తండ్రిగార్కి ఆ భూమి చెందుతుంది.. బ్రతికి పొందగోరిన సుఖం ఎండమావి అయింది. విజయం నాదేనండీ.. సర్వనాశనమై కట్టుగుడ్డలతో పుట్టిల్లు చేరే సమయం రాకముందే త్వరలో కళ్లు తెరచి తెగించాను. ఒక విధంగా బాగుపడ్డాను..'' ఆయన కళ్లద్దాలు సరిచేసికొన్నారు. ''డాక్టర్ గారూ, ఈ అమ్మాయి వేసికొన్న మాత్రలు పొరపాటున.. నిద్ర కోసం.. కొద్దిగ డోసు ఎక్కువ వేసికొన్నట్లయితే యిదే మాదిరి సీరియస్‌గా అయ్యేదా! లేక కొద్దిగ తక్కువ మోతాదులో వేసికొన్నా...'' ఆయన అర్థవంతంగా చూస్తూ ఆపు చేశారు.

డాక్టర్ ఆయన వైపు కన్నార్పకుండా చూచి మందహాసం చేశారు



"శరీరతత్వాన్నిబట్టి వుంటుంది. ఈమె చాల బలహీనంగా వున్నారు. నాల్గుచాలు ప్రాణాపాయం కల్గించటానికి. అదే కొందరు నాల్గు వేసికొని సాధారణమైన నిద్ర పోతారు. ఈ మాత్రలు అంత శక్తివంతం కావు..."

ఆయన లేచి నుంచున్నారు "మీ తండ్రి గారొస్తే ఓ మాటు నన్ను కలవమని చెప్పండి. మీపై ఏ నింద లేదమ్మా."

"కృతజ్ఞురాలిని" కమల శిరసు వంచి నమస్కరించింది.

"మీ మేలు మరువలేము" అంటూ, మామగా రతన్ని అనుసరించారు. కొద్ది దూరం నడిచి ఆయన చటుక్కున ఆగారు. "ఆమెను గూర్చి ఏ మాలోచించారు?... మీ అబ్బాయి యిక యీమెతో కాపురం చేయడు." మామగారు తల పంకించారు. ఒక్క నిట్టూర్పు వదలి మెల్లగా అన్నారు. "ఔను.. వాడి మాటలు విన్నాము. ఇక కాపురం చేయడు.. డబ్బులేని వాడిని అది ఎవతేనా గాని రానివ్వదు.. మా వియ్యంకులు వస్తే ఆమె భవిష్యత్తును గూర్చి ఒక నిర్ణయానికి రావాలి.. తిరిగి వివాహం చేసే డబ్బు సాయం చేయాలని వుంది.. కొడుకు వీధి పాలయ్యాడు.. కనీసం వాడి బిడ్డల్ని చూచి వాళ్ల కోసమైన బ్రతకాలనుకున్నాము. కానీ వాడు అందుకు కూడ పనికి రాలేదు..ప్చ..."

ఆయన వెళ్లిపోతూ అన్నారు "మళ్లీ పెళ్లి చేయండి.."

కమల గదిలోకి వెళ్లారాయన.. "నాన్నారు రాగానే వెళ్తాను మామయ్యా.. వారేమైన చెప్పారా?..."

"లేదమ్మా.. అంతా విన్నాను.. నువ్వు వెళ్లిపోవటమే శ్రేయస్కరం. ఎక్కడో ఒక దగ్గర సుఖంగా వుండు తల్లీ..డైవర్స్ చేసే నీకు యింకా స్వేఛ్ఛ".

ఆ చివరి మాటలు కమల హృదయాన్ని బలంగా తాకినయ్.- మామగారి కేసి విస్తుపోయి చూచింది. డైవర్స్.. తనకు స్వేఛ్ఛ. ఆయన ఏటు చూసు న్నారు!

"ఏమంటావమ్మా" బ్రతిమాలుతున్నలా అడిగారు. కాసేపాగి మెల్లగా.

"మీ యిష్టం.." పైకి అన్నది. "నేనుపూర్తిగా గెలిచాను" హృదయంలో మారుమ్రోగింది. హృదయం ప్రశాంతమైంది. తండ్రికి కోసం నిరీక్షిస్తూ విశ్రాంతిగా పడుకుంది కమల.●

